గౌరీ పూజకు వేళాయె



- నేడు మంగళ గౌరీ నోములు
- కిటకిటలాడిన మార్కెట్లు

గౌరమ్మ విగ్రహంతో మహిళ

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలలో ముందురోజు గౌరీపూజ చేసే సంప్రదాయానికి రాష్ట్రప్రజలు సిద్ధమయ్యారు. వినాయకుడి తల్లి గౌరి దేవతను కొలిచి వ్రతం చేస్తారు. గౌరీదేవతకు పూలు, పండ్లు, పత్రులు సమర్పిస్తారు. గౌరిదేవతను ప్రతి ఇంటా ఆడపడుచుగా సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు చేస్తారు. ఇలా గౌరీపూజకు రాష్ట్రమంతటా సిద్ధమైంది. పండుగకోసం (మిగతా7లో)

(మిగతా7లో)



కేఆర్ మార్కెట్లో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

60 రోజుల్లో చార్జ్‌షీట్ తప్పనిసరి

- ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసుల్లో నిర్లక్ష్యం తగదు
- అధికారులకు సీఎం సిద్దరామయ్య ఆదేశం



విధానసౌధ సమావేశంలో సీఎం సిద్దరామయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ సామాజికవర్గానికి చెందినవారిపై దౌర్జన్యానికి, దాడులకు సంబంధించిన కేసుల్లో 60 రోజులలోగా చార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించాలని సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. విధానసౌధలో సోమవారం రాష్ట్రస్థాయి చైతన్యం, ఇన్‌చార్జ్ మంత్రుల సభ నిర్వహించారు. చీఫ్ సెక్రటరీ శాలినిరజనీశ్, మంత్రులు హెచ్‌కే పాటిల్, ఆర్‌బీ తిమ్మాపుర, మహదేవప్ప, మునియప్పలతో పాటు పలువురు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గడిచిన ఆరు నెలల్లో 84శాతం కేసులలో నిర్ణీత గడువులో చార్జ్‌షీట్ అమలయ్యాయని, వందశాతం సాధ్యం చేయాలన్నారు. పోలీసులు ఏదో ఒక కారణంతో వాయిదా వేయరాదన్నారు. కోర్టుల్లో 56కేసులకు స్టే ఉందని, వెంటనే తొలగించే ప్రక్రియ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో అట్రాసిటీ కేసులను వేగవంతంగా విచారణ జరిపేందుకు 11 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశామన్నారు. త్వరితగతిన విచారణ జరిపి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రస్తుతం శిక్షలు కేవలం 10శాతం మందికి మాత్రమే సాధ్యమవుతోందన్నారు. నిందితులతో పోలీసులు సన్నిహితం కారాదన్నారు. దౌర్జన్యం ద్వారా అంగవైకల్యం జరిగితే వైద్య పరిహారం పెంచే విషయమై పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. 2023 నుంచి మూడేళ్లలో 6,635 కేసులు నమోదయ్యాయన్నారు. చార్జ్‌షీట్‌లు నమోదు చేసింది, 4912 కేసులకు మాత్రమే అన్నారు. 60రోజులలోగా చార్జ్‌షీట్ దాఖలైంది 4,149 కేసులు అన్నారు. శిక్షకు గురైనవారు 36మంది మాత్రమే ఉన్నారన్నారు. విచారణదశలో 679 కేసులు ఉన్నాయని, ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు. అట్రాసిటీ చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలని సూచించారు. తప్పుడు కులధ్రువీకరణపత్రాలు పొందేవారిపై కఠిన చర్యలు ఉండాలన్నారు. ప్రస్తుతం 170మంది నకిలీ కులధ్రువీకరణపత్రాలు పొందిన కేసులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 33 డీసీఆర్ఈ (డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) పోలీస్ స్టేషన్‌లు తెరుస్తున్నామని, ఇక్కడ సిబ్బంది కొరత ఉంటే భర్తీ చేసేందుకు సిద్ధమన్నారు. ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించాలన్నారు. దౌర్జన్యం కేసులకు వ్యతిరేకంగా ఫిర్యాదులు పెరుగుతున్నాయన్నారు. అటువంటి సమయంలో సంఘటనా స్థలానికి వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. ఎమ్మెల్యేలు ఏసీ శ్రీనివాస్, హెచ్‌వీ వెంకటేశ్, సుధామదాస్, ఏఆర్ కృష్ణమూర్తి, నరేంద్రమస్వామి, తిమ్మయ్య, బాగీరథి, శాంతారాం సిద్ది, బసవరాజ్, బీఎం నాగరాజ్, శ్రీనివాస్, బసనగౌడ తుర్విహాళ్, రాజు వేణుగోపాల్‌నాయక్, డాక్టర్ ఉమేశ్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

1న మైసూరుకు రాష్ట్రపతి



రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

బెంగళూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మైసూరు మహారాజ ప్యాలెస్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము సెప్టెంబరు 1న సందర్శించనున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ప్యాలెస్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మైసూరు రాజమాత ప్రమోదాదేవి ఒడయార్, రాష్ట్రపతికి ఓ ప్రత్యేక లేఖను రాశారు. మైసూరు ప్యాలెస్‌ను సందర్శించాలని కోరారు. రాజమాత ఆహ్వానం మేరకు రాష్ట్రపతి విచ్చేయనున్నారు. మైసూరు ప్యాలెస్ చరిత్ర, సంస్కృతి పట్ల రాష్ట్రపతి ఆసక్తి చూపారని ప్యాలెస్‌వర్గాలు తెలిపాయి. అదే రోజున అఖిలభారత స్పీచ్ అండ్ హియిరింగ్ వజ్రమహోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొననున్నారు. రాష్ట్రపతి పర్యటన తరుణంలో సోమవారం మైసూరులో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష జరిగింది. పర్యటన సందర్భంగా 1,2 తేదీల్లో ప్యాలెస్‌లోకి సందర్శకులను అనుమతించరు.

నలుగురు పరిషత్ సభ్యుల పేర్లు ఖరారు



రమేశ్‌బాబు



ఆరతి కృష్ణ

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో ఖాళీగా ఉండే నాలుగు నామినేటెడ్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. శాసనసభ సమావేశాలకు ముందే పేర్లు వెలువడుతాయని భావించినా పలు కారణాలతో జాప్యం జరిగింది. నలుగురి పేర్లు ఖరారయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రమేశ్‌బాబుకు అవకాశం లభించింది. ఆయనపై పలు ఆరోపణలు వచ్చినా సీఎం సిద్దరామయ్య అవకాశం కల్పించారు. ఇక కాంగ్రెస్ పార్టీ విదేశీ వ్యవహారాల విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఆరతి కృష్ణ, మైసూరుకు చెందిన శివకుమార్, హుబ్బళ్ళి-ధారవాడకు చెందిన ఎఫ్‌హెచ్ జక్కప్పల పేర్లు ఖరారు చేశారు. రెండు నెలలక్రిందటే నలుగురి పేర్లతో జాబితా తుదిదశకు వచ్చినా అధిష్ఠానం వ్యతిరేకించడంతో సాధ్యం కాలేదు. గతంలో ప్రకటించిన జాబితాలో ఉన్న ఆరతి కృష్ణ, రమేశ్‌బాబు యధావిధిగా కొనసాగినా మరో ఇద్దరి పేర్లు గల్లంతయ్యాయి.

ఆందోళన అవసరం లేదు

- కేంద్ర మంత్రి కుమారస్వామి ఆరోగ్యంపై కుమారుడు నిఖిల్


బెంగళూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి కుమారస్వామికి ఆరోగ్య సమస్యలు ఉన్నది వాస్తవమేనని అయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కుమారుడు నిఖిల్‌కుమార్ వెల్లడించారు. దేవనహళ్లిలో జేడీఎస్ కార్యకర్తల సమావేశంలో పార్టీ యువ విభాగం అధ్యక్షుల హోదాలో హాజరైన నిఖిల్ మాట్లాడుతూ కుమారస్వామి ఆరోగ్యంలో కొంత మార్పు వచ్చింది వాస్తవమే అన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలని పర్యటనలు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రజాసమస్యల కోసం పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే 80 నియోజకవర్గాల్లో పర్యటించానని, ప్రతి రోజు తన ఆయుష్షు కూడా తన తండ్రికే ఇవ్వాలని దేవున్ని వేడుకుంటాన్నారు. తాత దేవేగౌడ, తండ్రి కుమారస్వామిలు శతాయుష్షులవుతారన్నారు. త్వరలోనే కుమారస్వామి సంపూర్ణంగా కోలుకుంటారన్నారు. కుమారస్వామి ఆరోగ్యం బాగాలేదని రాష్ట్ర వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయన్నారు. తల్లిదండ్రుల దీవెనలు భగవంతుడి కృప, అభిమానులు, కార్యకర్తల ప్రేమానురాగాలతో ఆయన ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రిగా తన తండ్రి చేపట్టిన సంక్షేమాల పట్ల ప్రజల సంతోషంతో ఉన్నారన్నారు. భవిష్యత్తులో జేడీఎస్ రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకం కానుందన్నారు.

నేటి నుంచి కోలారు ఓపెన్ 2025 గోల్ఫ్ పోటీలు

ఆలోచనలు, అవకాశాలతోనే విజయం సాధ్యం

7

ప్రైవేట్ బాట



- ప్రభుత్వ పాఠశాలల్లో మూడేళ్లలో తగ్గిన 5 లక్షలమంది విద్యార్థులు
- అందరి చూపు ప్రైవేట్ వైపే
- సకల సౌకర్యాలు కల్పిస్తున్నా ఫలితం శూన్యం

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఏటా విద్యాశాఖకు వేలకోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచారు. విద్యార్థులకు చదువుతోపాటు యూనిఫాం, ఉచితంగా పుస్తకాలు సకాలంలో సమకూరుస్తున్నారు. వీటన్నింటితోపాటు పౌష్టికాహారం అందించాలనే మధ్యాహ్న భోజనంలో ప్రతిరోజూ గుడ్డు సమకూరుస్తున్నారు. ఇలా ప్రభుత్వ పాఠశాలల పట్ల విద్యాశాఖ ప్రత్యేక చొరవ చూపుతోంది. ప్రాంతాలవారీగా విద్యాశాఖ అధికారులు సమస్యలు ఉంటే వెంటనే రంగంలోకి దిగుతున్నారు. ఒకప్పటి తరహాలో కాకుండా ప్రతిరోజూ పాఠశాలల్లో తగిన సమయంలోనే తెరవడం, సాయంత్రం దాకా కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయులు చెప్పా పెట్టకుండా పాఠశాలనుంచి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. అయినా ప్రభుత్వ పాఠశాలలవైపు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గుచూపడం లేదు. ఈ పర్యవసానం ప్రభుత్వ పాఠశాలలపై పెను ప్రభావం చూపుతోంది. ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతూనే

సర్కార్ బడుల మనుగడ ప్రశ్నార్థకమే..

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య ఏటా గణనీయంగా తగ్గుతోంది. ఇటీవల మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను వదిలిన విద్యార్థులు వందలు వేలల్లో కాదు ఏకంగా 5లక్షలమందికి పైగా ఉన్నారు. పదో తరగతి ముగించే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు లక్షల్లో ఉంటారు. అయితే ఆ స్థాయిలో ప్రాథమికదశలో అడ్మిషన్లు జరగడం లేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. ఇప్పటికే పాఠశాలలు విలీనం చేయాలని, పదిమందిలోపు విద్యార్థులు కల్గిన పాఠశాలలు మూసివేయాలనే డిమాండ్ రెండేళ్లుగా సాగుతోంది. విద్యార్థుల సంఖ్య ఏటా ఆందోళన కలిగించేలా ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుముఖం పడుతుండడంతో విద్యాశాఖ మూసివేయాలనే ఆలోచన నుంచి వెనుకడుగు వేస్తోంది. రెండు నెలలక్రిందట విద్యాసంవత్సరం ప్రారంభమైంది. కొన్ని ప్రాంతాలలో ఒక పాఠశాలలో ఒకే విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడు ఉండడం, మరో పాఠశాలలో ఓ విద్యార్థిని మాత్రమే ఉన్నా హెడ్మాస్టర్, ఓ ఉపాధ్యాయుడు ఉన్న విషయం కోలారు జిల్లాల్లో వెలుగులోకి వచ్చింది. ఇది ఒక జిల్లాతోనే పరిమితం కాలేదు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఇటువంటి పరిస్థితి కొనసాగుతోంది. ఐదుమంది లోపు విద్యార్థులు ఉన్నారని మూసివేసేందుకు సిద్ధమైతే వారి భవిష్యత్తు ఏం కావాలనేది ఓ ప్రశ్న కాగా, అంతకుమించి వందలసంఖ్యలో పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది.



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

- ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను ఆకర్షించే దిశగా పలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో మాత్రమే ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండేవి. కానీ ఇటీవల దశాబ్దన్నర కాలంలో హోబళిస్థాయిలోనూ రెండుమూడు ప్రైవేట్ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్‌లు వెలిశాయి. ఇక్కడ ప్రాథమికదశ నుంచే ఇంగ్లిష్‌మీడియం బోధిస్తామని, క్రీడలు, యోగాతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని ప్రచారం చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు ప్రైవేట్ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్రంలో వేలసంఖ్యలో ఉన్నాయి. ఫీజులు కూడా భారీ స్థాయిలోనే వసూలు చేస్తున్నారు. గతంలో పేదరికం ప్రతిఇంటా నలుగురైదుగురు పిల్లలు ఉండేవారు. దీంతో అందరికీ చేరి ఫీజులు లక్షలలో చెల్లించాల్సి ఉంటుందని వెనుకంజ వేసేవారు. ఇటీవల ఒకరు లేదా ఇద్దరు పిల్లలు మాత్రమే కుటుంబంలో ఉంటున్నందున వారికి మంచి విద్య అందిస్తే చాలు అనే ధోరణితో ఉన్నారు.
- 2022-23 విద్యాసంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 20వేలమందికిపైగా ఎక్కువమంది విద్యార్థులు చదువును సాగించేవారు. గత ఏడాది విద్యాసంవత్సరం నాటికి ప్రభుత్వపాఠశాలలకంటే ప్రైవేట్ పాఠశాలల్లో ఏకంగా 8 లక్షలమంది విద్యార్థులు పెరిగారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో మరింత తగ్గినట్టు తెలుస్తోంది. అయితే సమగ్ర గణాంకాలను విద్యాశాఖ ఇంకా ప్రకటించలేదు. కన్నడ మీడియంతోపాటు ఇంగ్లిష్‌ను బోధించే విధానం తీసుకురావాలని, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయరాదని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. అయితే క్లస్టరింగ్ విధానంతో 3-4 పాఠశాలలు కలపాలనే విద్యాశాఖ నిర్ణయానికి రాష్ట్రమంతటా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలను ప్రాంతాలవారీగా ప్రారంభించేది. ఇటీవల కర్ణాటక పబ్లిక్‌స్కూళ్ల విధానానికి ప్రాధాన్యం ఇస్తోంది. తద్వారా ఒకే క్యాంపస్‌లో 14ఏళ్లపాటు చదువుకునే అవకాశం దక్కుతుంది. ఎల్‌కేజీ, యూకేజీతోపాటు పీయూ ద్వితీయ సంవత్సరం దాకా చదువుకోవచ్చు. ప్రస్తుత పాఠశాలలకు సమగ్రంగా సౌలభ్యాలు కల్పించేందుకు పురాతన తరగతి గదులను తొలగించడం, వాటి స్థానంలో కొత్తవాటిని నిర్మించడం లేదా మరమ్మతులు చేయాల్సి ఉంది. అయితే కర్ణాటక పబ్లిక్ స్కూల్‌లకు సమగ్ర సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్నందున విద్యార్థులు ఆసక్తి చూపే అవకాశాలు ఉన్నాయి.

విద్యాసంవత్సరం	ప్రభుత్వ	ఎయిడెడ్	ప్రైవేట్
	(విద్యార్థులు	లక్షలసంఖ్యలో)	
2022-23	45.46	12.49	45.26
2023-24	42.94	13.31	46.97
2024-25	40.74	11.86	48.36



కర్ణాటక పబ్లిక్ స్కూల్



తుంగభద్ర డ్యాంను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పదవులపై ఉన్న శ్రద్ధ ప్రాజెక్టులపై లేదు

- టీబీ డ్యాం భద్రత మరిచిన సిద్దరామయ్య ప్రభుత్వం
- ప్రతిపక్ష నాయకుడు అశోక్ మండిపాటు

బళ్లారి/హోస్పేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయాలపై, పదవులను కాపాడుకోవడంపై ఉన్న ఆసక్తి రైతులపై కానీ, ప్రాజెక్టులపై కానీ లేదని ప్రతిపక్షనాయకులు అశోక్ మండిపడ్డారు. సోమవారం తుంగభద్ర డ్యామ్‌ను బీజేపీ నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా అశోక్ మీడియాతో మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్యకు పదవిని కాపాడుకునేందుకే సమయం సరిపోలేదని, రైతుల బాగోగులు మరిచే పోయారన్నారు. దీనికి ప్రధాన ఉదాహరణ టీబీ డ్యాం పరిస్థితేనన్నారు. గతేడాది క్రస్ట్‌గేటు కొట్టుకుపోయి రైతులు ఎంతో ఆందోళనకు గురయ్యారని, ప్రభుత్వం అప్పుడు హడావుడి చేసిందే కానీ తర్వాత డ్యామ్ భద్రతపై దృష్టి పెట్టింది లేదన్నారు. ఎందరో రైతులకు జీవనాడి అయిన తుంగభద్రను విస్మరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని గేట్లను మార్చి డ్యామ్‌ను కాపాడాలన్నారు. నవంబర్‌లో రాష్ట్ర రాజకీయాలు మారనున్నాయని, సీఎం దిగిపోవచ్చన్నారు. పదవులు కాపాడుకునేందుకు అధికార పార్టీ నాయకులు తాపత్రపడుతున్నారే కానీ తుంగభద్ర డ్యాం గురించి, రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. తుంగభద్ర డ్యాం భద్రతపై దృష్టి పెట్టకపోతే కర్నాటక, ఆంధ్ర రెండు రాష్ట్రాల రైతులూ నష్టపోక తప్పదన్నారు. ఇప్పటికి అధికారుల లెక్కల ప్రకారం 140 టీఎంసీల నీరు నదికి వెళ్లాయని, దీని వల్ల ఎవరికి నష్టం అని అన్నారు.

హిందూ దేవాలయాలపై కాంగ్రెస్ కుట్ర

ధర్మస్థల అంశంపై కాంగ్రెస్ వాళ్లు కావాలనే గొడవ సృష్టిస్తున్నారని, ఇది హిందూ దేవాలయాలపై కుట్రేనని ప్రతిపక్ష నేత అశోక్ అన్నారు. హోస్పేట్‌లో టీబీ డ్యాం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందూ దేవాలయాలే లక్ష్యంగా ఇటీవల సోషల్ మీడియాలో కథనాలు సృష్టిస్తున్నారన్నారు. దీని వెనుక పెద్ద ముఠా పనిచేస్తోందన్నారు. మాస్క్ మ్యాన్ అనన్యభట్ వీరంతా పాత్రధారులు. ప్రభుత్వం ముసుగు వేసుకున్న వ్యక్తి వెనుక ఉంది. ప్రభుత్వమే అతనికి మద్దతు ఇస్తోందన్నారు. అనామకుడి మాట విని సిట్ ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ముసుగు వేసుకున్న వ్యక్తిని ముసుగు తీయమని తాను గతంలో రెండు సార్లు చెప్పాను. అతను ముసుగు తీసేసి ఉంటే అతను దొంగ అని తెలిసి ఉండేది. అతను మతం మారిన వ్యక్తి అని తెలిసింది. గ్రామం మొత్తం ముసుగు వేసుకున్న వ్యక్తిని ప్రశ్నిస్తున్నారని అశోక్ అన్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ పేరుతో రచ్చ చేస్తోందన్నారు.

టీబీ డ్యాం గేట్లను పునర్నిర్మించాలి

- రైతు సంఘం నాయకులు చామరస మాలిపాటిల్

8

రాహుల్ పోరాట ర్యాలీ కోసం

బిహార్‌కు సీఎం

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఓటుచౌర్యంపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్ అధికార్ ర్యాలీలో పాల్గొనేందుకు సీఎం సిద్దరామయ్య బిహార్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈనెల 29న బిహార్ రాజధాని పాట్నాలో జరిగే నిరసన ర్యాలీలో సీఎం పాల్గొంటారు. ఇటీవల జాతీయస్థాయిలో జరిగే పలు కార్యక్రమాలకు కాంగ్రెస్ అధిష్ఠానం, సీఎం సిద్దరామయ్యను ఆహ్వానిస్తోంది. ఓబీసీ నేతగా సిద్దరామయ్యకు కాంగ్రెస్‌లో ప్రాధాన్యత కల్పిస్తున్నారు. సహకారశాఖ మంత్రి రాజణ్ణను కేబినెట్ నుంచి తొలగించే విషయంలో రాహుల్ గాంధీ తీవ్రంగా సీఎంతో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. పాట్నా సభలో పాల్గొన్న సందర్భంలో రాజణ్ణకు సంబంధించి రాహుల్‌గాంధీతో చర్చించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవలే డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు పదిమంది ఎమ్మెల్యేలు బిహార్‌కు వెళ్లి రాహుల్‌గాంధీతో కలసి నిరసన ర్యాలీలో పాల్గొన్నారు.

అదే పాట..!

- డీసీఎం ఆర్ఎస్ఎస్ శ్లోకంపై సొంతపార్టీలోనే విమర్శల వెల్లువ

బెంగళూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆర్సీబీ విజయోత్సవాలకు సంబంధించి జరిగిన చర్చల్లో గత వారం శాసనసభలో డీసీఎం డీకే శివకుమార్ 'నమస్తే సదా వత్సలే మాతృభూమి...' అనే ఆర్ఎస్ఎస్ ప్రార్థనాగీతాన్ని పఠించడం తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. ఆ మరుసటి రోజే శుక్రవారం డీకే శివకుమార్ తాను పుట్టుకతో కాంగ్రెస్ వాదినని, చావు కూడా కాంగ్రెస్‌లోనని... వివరణ ఇచ్చారు. అయినా కాంగ్రెస్ సీనియర్ నేత బీకే హరిప్రసాద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ శ్లోకం పాడిన శివకుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరి మెప్పు పొందేందుకు అలా వ్యవహరించారో మాకు తెలియదని, అయితే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా క్షమాపణ చెప్పాలన్నారు. ఇక మరోవైపు మాజీ మంత్రి రాజణ్ణ ఇప్పటికే పలు విమర్శలు చేశారు. ఆర్ఎస్ఎస్ శ్లోకం పాడినా, కేంద్రమంత్రి అమిత్‌షాతో, సద్గురు జగ్గీవాసుదేవ్ సభలో ప్రైవేట్‌గా పాల్గొన్నా, రాహుల్‌గాంధీ వద్దనుకున్నా ముకేశ్ అంబాని కుమారుడి పెళ్లికి హాజరవుతారని ఆయన ఏమైనా చేయవచ్చునని విమర్శించారు. మరోవైపు ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే స్పందిస్తూ ఆర్ఎస్ఎస్ గాలి కూడా మనకు సోకరాదన్నారు.



చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణసౌకర్యం

- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి


కుళువ సమాజాభివృద్ధికి సహకారం

: మంత్రి సంతోష్ లాడ్

8

క్రైం కార్నర్

రాలిన మరో నేతన్న


చౌడయ్య మృతదేహం

ధర్మవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అప్పులకు మరో నేతన్న బలయ్యాడు. పట్టణంలోని శివానగర్‌కు చెందిన చేనేత కార్మికుడు పామిశెట్టి చౌడయ్య(60) అప్పుల బాధ భరించలేక సోమవారం ఇంట్లో ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చౌడయ్య కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. మగ్గం గిట్టుబాటు కాక కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఇటీవల వర్షాలు కురవడంతో మగ్గం పని సాగలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకున్నాడు. కాసేపటికి కుటుంబ సభ్యులు గమనించగా.. అప్పటికే అతడు మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, శవాన్నిస్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చౌడయ్యకు భార్య లక్ష్మీదేవి, కుమారుడు సంజీవరాయుడు, కుమార్తె జయలక్ష్మి ఉన్నారు. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ప్రాణంతీసిన చేపల వేట సరదా

● చెరువులో మునిగి బేల్దారి మృతి


రామాంజనేయులు (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చేపల వేట సరదా బేల్దారి ప్రాణం తీసింది. చేపల పట్టేందుకు వెళ్లి ధర్మవరం చెరువులో మునిగి బేల్దారి సాకే రామాంజనేయులు (40) మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన రామాంజనేయులు బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. ఆదివారం ధర్మవరం చెరువు వద్దకు చేపలు పట్టేందుకువెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి, ఊపిరాడక మరణించాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో పట్టణంలోనే ఉన్న అతడి అమ్మ వాళ్ల ఇంటికి వెళ్లి ఉంటాడని భార్య లక్ష్మీనరసమ్మ భావించింది. సోమవారం ఉదయం చెరువు వైపు వెళ్లిన వారు.. రామాంజనేయులు మృతదేహం తేలియాడుతుండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు చెరువు వద్దకు చేరుకుని, మృతదేహాన్ని బయటకు తీశారు. ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. రామాంజనేయులుకు కుమారుడు సాయిలక్ష్మణ్, కుమార్తె నవతలక్ష్మి ఉన్నారు.


సైబర్ మోసం.. రూ.94 వేలు హాంఫట్


మోసపోయిన దంపతులు అంజినప్ప, భాగ్యమ్మ

రొద్దం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ అంజినప్ప భార్య భాగ్యమ్మ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.94 వేలు కొట్టేశారు. భాగ్య మ్మ మొబైల్‌ను ఆదివారం అర్ధరాత్రి ఆమె కుమారుడు నాగార్జున వాడుతుండగా సైబర్ నేరగాళ్లు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని చెప్పారు. వారు చెప్పినట్లు చేయడంతో పలు దఫాలుగా మొత్తం రూ.94వేలు ఖాతా నుంచి మాయమైంది. తల్లిదండ్రులు తిడతారన్న భయంతో నాగార్జున ఇంట్లో నుంచి పరారయ్యాడు. ఉదయం డబ్బు పంపించేందుకు ప్రయత్నించగా.. అకౌంట్‌లో సున్నా నిల్వ అని చూపడంతో వెంటనే బ్యాంకుకు వెళ్లారు. నగదు మాయమైన విషయాన్ని ఫిర్యాదు చేయగా.. సైబర్ నేరగాళ్లు లాగేసుకున్నారనీ, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు.

ప్రాణం తీసిన ప్రేమ

సూటిపోటి మాటలతో మనస్తాపం.. స్వాతి ఆత్మహత్య


స్వాతి (ఫైల్)

అనంతపురం క్రైం, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ప్రేమ.. యువతి ప్రాణాలు బలి తీసుకుంది. 'మా ప్రేమకు నువ్వే అడ్డుగా ఉన్నావ్. నువ్వే చనిపోతే... ఇబ్బందులు తొలగిపోతాయ్' అంటూ ప్రేమికులు.. స్వాతిని సూటి పోటి మాటలతో వేధించారు. దీంతో 22 ఏళ్ల స్వాతి తను ఉంటున్న స్థానిక సాయినగర్‌లోని హాస్టల్ గదిలోనే ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సీఐ శ్రీకాంత్ యాదవ్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గొందిపల్లికి స్వాతి నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతుండేది. సాయినగర్‌లోని దీపు బ్లడ్ బ్యాంకులో ల్యాబ్ టెక్నీషియన్‌గా కూడా పనిచేస్తుండేది. అక్కడే ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్న అరుణ్.. మరో యువతి ప్రతిభా భారతిని ప్రేమిస్తున్నాడు. అరుణ్ ఆమెతోపాటు, స్వాతిని కూడా ప్రేమించాడు. ప్రతిభా భారతి విషయం తెలుసుకుని స్వాతి దగ్గరకు వచ్చి... 'నేను, అరుణ్ ఎప్పటి నుంచో ప్రేమించుకుంటున్నాం, మా ప్రేమకు నువ్వే అడ్డువస్తున్నావ్. ఈ విషయాన్ని ల్యాబ్‌లో, హాస్టల్‌లో చెబుతా. నువ్వు చనిపోతే... మాకు ఇబ్బందులు తొలగుతాయి' అంటూ హెచ్చరించింది. దీంతో స్వాతి మనస్తాపం చెంది ఉదయం 7.30 గంటలకు తాను ఉంటున్న బాలాజీ హాస్టల్‌లో తన చున్నీతోనే ఉరివేసుకుంది. గమనించిన స్నేహితులు.. ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి పూజారి నాగభూషణం ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ సిబ్బంది బాహాబాహీ

● విరిగిన కార్యదర్శి చేయి

గోరంట్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లిలో విధి నిర్వాహణ విషయంలో పంచాయతీ కార్యదర్శి ఫారూక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలాజీ సోమవారం బాహాబాహీకి దిగారు. దీంతో కార్యదర్శి చేయి విరిగింది. కమ్మవారిపల్లి ఎస్సీ కాలనీలో సర్వేకోసం కార్యదర్శి ఫారూక్, క్లాప్‌మిత్ర రామన్న వెళ్లారు. సర్వేలో సర్వేయర్, వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొనాల్సి ఉంది. వారు రాకపోవడంతో ఆలస్యంగా వచ్చిన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను కార్యదర్శి ప్రశ్నించడంతో వివాదం తలెత్తింది. కార్యదర్శి. మండలపరిషత్ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో ఇరువురు ఘర్షణకు దిగారు. కిందపడ్డ కార్యదర్శి ఫారూక్ ఎడమచేయి విరగడంతో వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు. ఘర్షణపై పోలీసులు ఆరాతీశారు. ఫీల్డ్ అసిస్టెంట్ బాలాజీ, మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి, ఎంపీడీఓ నరేంద్రకుమార్‌కు విషయం వివరించారు. కాలనీలో ఒకరికొకరు చెప్పులతో కొట్టుకున్నట్లు బాలాజీ తెలిపారు. ఘర్షణపై ఎంపీడీఓ క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు.


దాడిలో గాయపడిన కార్యదర్శి ఫారూక్


ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలాజీ

డీపీఓను వెంటాడుతున్న గతం

● నాటి తప్పిదాలతో సతమతం
● సంజాయిషీ ఇచ్చుకోవడానికి పక్క జిల్లా పర్యటనలు
● సీనియార్టీ జాబితాలో తిరకాసు
● కలెక్టర్ చుట్టూ ప్రదక్షిణ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఏమి జరుగుతోందో అంతచిక్కడం లేదు. డీపీఓ నాగరాజనాయుడును వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాలు వెంటాడుతున్నాయి. దీంతో ఆయన ఇక్కడ సరిగ్గా విధులు నిర్వర్తించలేకపోతున్నారని ఆ శాఖలో చర్చ జరుగుతోంది. జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా ఇద్దరికి ఉద్యోగోన్నతి కల్పించడానికి తిరకాసు పెడుతున్నారని సమాచారం. కలెక్టర్ వద్దకు ఫైల్ వెళ్లడం, తిరిగి రావడం షరా మామూలుగా మారింది. డీపీఓ కార్యాలయ సిబ్బంది తయారు చేసిన సీనియార్టి జాబితాలో రోస్టర్‌కు విరుద్ధంగా ఉన్నట్లు చర్చ జరుగుతోంది. దీంతో మరోసారి జాబితా మార్చాల్సిన పరిస్థితి నెలకొంది. డీపీఓ నాగరాజనాయుడు వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాలకు ప్రస్తుతం సంజాయిషీ ఇవ్వడానికి పక్క జిల్లాకు వెళుతున్నట్లు తెలుస్తోంది. పనిరోజుల్లో మరో జిల్లాకు వెళ్లాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరి. డీపీఓ అదే మార్గంలో ఏదో ఒక పంచాయతీని తనిఖీలు చేపట్టి, ఎలాంటి అనుమతులు లేకుండానే సంజాయిషీ ఇచ్చుకోవడానికి మరో జిల్లాకు వెళుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ పెద్దల అండదండలతో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకు ప్రధాన సాక్ష్యంగా సంజాయిషీ కోసం తిరుగుతున్న ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ నిర్ణయాలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆ శాఖలో చర్చించుకుంటున్నారు.



ఉద్యోగోన్నతుల జాబితాలో గందరగోళం

జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ లీలాబాయి, ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌కు నెలన్నర క్రితం ఉద్యోగోన్నతి కల్పించి డిప్యూటీ ఎంపీడీఓలుగా నియమించారు. దీంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి. డీపీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కీలకం. వెంటనే అర్హుల జాబితా సిద్ధం చేశారు. కలెక్టర్ ఆమోదం కోసం తిరుగుతున్నారు. ఈలోపే గ్రేడ్-4 కార్యదర్శులకు గ్రేడ్-3 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. తర్వాత ప్రకటించిన సీనియార్టి జాబితాలో తిరకాసు ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. రోస్టర్ సరిగా అమలు చేయకపోవడంతో కలెక్టర్ చీవాట్లు పెట్టినట్లు తెలిసింది. దీంతో కొత్త సమస్య మొదలైంది. ఇద్దరికి ఉద్యోగోన్నతి కల్పించడానికి తయారు చేసిన జాబితాలోనే తప్పులు ఉన్నాయి. పదుల సంఖ్యలో ఉద్యోగోన్నతులు కల్పించడానికి సిద్ధం చేసిన జాబితాలో దాదాపు 10 మంది వరకు డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లు పూర్తి చేయని గ్రేడ్-4 కార్యదర్శులకు అవకాశం కల్పించారన్న చర్చ జరుగుతోంది. ఇంకా ఎన్ని తప్పులు ఉంటాయోనని డీపీఓను కలెక్టర్ పలు మార్లు తిప్పుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. అనుభవం లేనివారితో జాబితా తయారు చేయడంతోనే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా పనుల్లో కాలయాపన జరుగుతోంది.

టమోటా కిలో రూ.28

అనంతపురంరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.28తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.14, సరాసరిధర రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,450 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1208 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

జిల్లాకు 1,022 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,022 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రయన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువుల ర్యాక్‌ను ఏడీఏ పరిశీలించారు. జిల్లాకు డీఏపీ 815 మెట్రిక్ టన్నులు, 20-20-0-13 రకం ఎరువులు 207 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయన్నారు. వీటిని ఏపీ మార్క్‌ఫెడ్, రిటైల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు.

ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో పీజీ డిప్లొమా కోర్సు ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం వీసీ ఆచార్య అనిత విడుదల చేశారు. ఫ్రెంచ్ 20మంది, జర్మన్ 19మంది, స్పానిష్ కోర్సులో 16 మంది మొత్తం 55మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఆర్డీటీ సహకారంతో కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పరీక్షల కంట్రోలర్ శ్రీరాములు నాయక్, ఆర్డీటీ ఫారిన్ లాంగ్వేజెస్ ప్రిన్సిపాల్ గీతాంజలి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): నగరంలోని మంగళవారి కాలనీకి చెందిన శ్రీరాములు(49) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీరాములు, మల్లీశ్వరి దంపతులకు పిల్లలు లేరు. శ్రీరాములు నగరంలోని సెలూన్ షాపుల్లో పనిచేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఇంటి బయట వాష్‌రూమ్ వద్ద ప్లాస్టిక్ వైర్‌తో ఉరేసుకుని, మరణించాడు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీరాములుకు రూ.5లక్షల వరకూ అప్పులున్నాయనీ, అధిక వడ్డీల భారం భరించలేకే ప్రాణం తీసుకున్నాడని తెలుస్తోంది.

అధిక వడ్డీ వేధింపుల వల్లే...

అధిక వడ్డీల వేధింపుల వల్లే శ్రీరాములు ఆత్మహత్య చేసుకున్నాడని అధిక వడ్డీల వ్యతిరేకపోరాట కమిటీ అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. శ్రీరాములు మృతదేహాన్ని ఆయన పరిశీలించారు. మృతుడి కుటుంబీకులతో మాట్లాడారు. నగరంలో అధిక వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక అమాయకులు పిట్టల్లా రాలుతున్నా... పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కిష్టప్ప సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.సెప్టెంబరు 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా అవార్డులు అందజేస్తామన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అవార్డులకు జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, ఎయిటెడ్ స్కూళ్లు, ఏపీఎంస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్, ఏపీఆర్ఈఐఎస్ కేజీబీవీ, డైట్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు రెండు సెట్లను 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఇవీ అర్హతలు..: కనీసం 10 సంవత్సరాలు బోధన అనుభవం ఉండాలి. గతంలో జిల్లాస్థాయిలో అవార్డు అందుకున్న వారు అనర్హులు. అవార్డుకు దరఖాస్తు చేసుకునే వారిపై క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జెస్, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉండరాదు. రాష్ట్ర అవార్డుకు దరఖాస్తు చేసుకున్న వారు అనర్హులు.

కుమారుడి ముందే తండ్రి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచం అంతమైనా నేను చావను. నేను చిరంజీవిని' అంటూ మండలంలోని నామాల గ్రామానికి చెందిన పాళ్యం ఆంజనేయులు(64) సోమవారం కుమారుడి ముందే విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంజనేయులు మానసిక స్థితి సరిగా లేదు. 30ఏళ్లుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పెద్ద కుమారుడు వెంకటేశ్ ముందే మొదట కొన్ని విషపు గుళికలు మింగాడు. ఆ తరువాత మరికొన్ని మింగుతుండగా అడ్డుకుని వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆంజనేయులుకు భార్య శివమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఫెన్సింగ్ జట్టు ఎంపిక


ఎంపికైన ఉమ్మడి జిల్లా ఫెన్సింగ్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): అండర్-17 ఉమ్మడి జిల్లాస్థాయి ఫెన్సింగ్ జట్టును ఎంపిక చేశారు. సోమవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో సెలెక్షన్స్ నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి పుష్పావతి ప్రకటించారు. బాలురలో సాయిసాత్విక్ రెడ్డి, వెంకట హర్షవర్ధన్‌రావు, సుశాంత్‌కృష్ణ, స్నేహిత్‌సింహ, ఆహిల్, రియాజ్‌సూరజ్, ఆంజనేయసాయి సూర్య, మిలిద్‌యాదవ్ ఉన్నారు. బాలికల విభాగంలో అస్నీఖదీజా, వందన, అమృత, లిఖితచౌదరి, చేతన, శరణ్యతేజ, తన్విత, వ్యాహిత ఎంపికయ్యారు. వీరు ఈనెల 30న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు లక్ష్మి, రాహు ల్, రవి పాల్గొన్నారు.

పాపను చూసి వస్తూ.. తండ్రి మృతి

● వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత
● పలువురికి గాయాలు



నజీర్, బాబాఫకృద్దీన్ (ఫైల్)

వజ్రకరూరు(ఉరవకొండ)/నల్లమాడ, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): పది రోజుల కన్నబిడ్డను చూసి వస్తూ.. తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఉమ్మడి జిల్లాలో రెండు వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. వజ్రకరూరు శివారులో ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో నజీర్(20), బాబాఫకృద్దీన్(30) మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పామిడికి చెందిన బాబాఫకృద్దీన్, ఫరూక్, నజీర్ మిత్రులు. భవన నిర్మాణ కార్మికులు. బాబాఫకృద్దీన్ అత్తగారి ఊరు ఉరవకొండ కాగా, 10 రోజుల క్రితం అతడికి కుమార్తె జన్మించింది. మిత్రులతో కలిసి కుమార్తెను చూడడానికి ఉరవకొండకు వచ్చాడు. పాపను చూసి, ముగ్గురు ద్విచక్రవాహనంపై పామిడికి బయల్దేరారు. వజ్రకరూరు శివారులో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే నజీర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. బాబాఫకృద్దీన్ చికిత్స పొందుతూ సోమవారం అనంతపురంలో మృతి చెందాడు. ఫరూక్ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి మహిళ..


ముత్యాలమ్మ (ఫైల్)

మండలంలోని కంబాలపర్తి గ్రామ సమీపంలో ఎగువ బ్రిడ్జి వద్ద ఆటో బోల్తాపడి మహిళ మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. మండలంలోని కుటాలపల్లి తండా నుంచి పుట్టపర్తిలోని సాయిబాబా మందిరంలో కూలి పనులకోసం రోజూ పదిమంది ఆటోలో వెళ్లేవారు. సోమవారం కూడా స్వగ్రామం నుంచి ఆటోలో పదిమంది, డ్రైవర్ ఉదయం బయలుదేరారు. కంబాలపర్తి సమీపంలో ఎగువ బ్రిడ్జి వద్దకు రాగానే బోల్తా అదుపుతప్పి, బోల్తాపడింది. ప్రమాదంలో ముత్యాలమ్మ (45) అక్కడికక్కడే మృతిచెందింది. గాయపడిన వారిని 108లో నల్లమాడ ఆస్పత్రికి తరలించారు. మంగమ్మ, ఆమె భర్త రామచంద్రనాయక్, శివమ్మను మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ నరేంద్రరెడ్డి, మహేష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించి, ముత్యాలమ్మ మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. ఆమెకు భర్త శీనానాయక్, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె మృతిచెందడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలి కుమారుడు శ్రీకాంత్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభిమాన సిత్రం..!



మంత్రి చిత్రంతో నేసిన చీర

సోమందేపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇంద్రా నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు చింతా రవీంద్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చిత్రంతో పట్టు చీరను నేశాడు. గతంలో అనేక డిజైన్లతో చీరలను నేసిన రవీంద్ర.. కూటమి ప్రభుత్వం చేనేతలకు అమలు చేస్తున్న పథకాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ఉచిత విద్యుత్ పథకం, 90 శాతం సబ్సిడీతో పనిముట్లు, చేనేత నేస్తం, 50 ఏళ్లకే పింఛన్ వంటి పథకాలు చేనేతలకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. అందుకే ఆ శాఖ మంత్రికి అరుదైన కానుకను ఇవ్వాలని భావించాననీ, సోమందేపల్లిలో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత హామీ ఇవ్వడంతో ఆమె చిత్రంతో చీరను నేశానని తెలిపారు. త్వరలో మంత్రి సవితకు అందిస్తానని తెలిపారు.

సర్పంచ్ మోనాలిసాకు కలెక్టర్ సన్మానం


సర్పంచ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

వజ్రకరూరు(ఉరవకొండ), ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ థీమ్‌లో జాతీయస్థాయి పురస్కారాన్ని దక్కించుకున్న వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసాను కలెక్టర్ వినోద్‌కుమార్ సన్మానించారు. అనంతపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి, అభినందించారు. భారత నాణ్యతా మండలి దేశంలోని సర్పంచ్‌లకు ఆన్‌లైన్‌లో నిర్వహించే సర్పంచ్ సంవాద్ పోటీల్లో మోనాలిసా పాల్గొని, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, ఐసీడీఎస్ పీడీ నాగమణి, ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

మార్కులు బహిర్గతం చేయాలి: యూటీఎఫ్

కొత్తచెరువు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల మార్కులను బహిర్గతం చేయాలని కలెక్టర్ చేతన్‌కు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికకు వారు హాజరై వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ కింద పది రకాల పోస్టులకు ఈ నెల 21న 34 మందికి ఇంటర్వ్యూలను నిర్వహించారన్నారు. వీరికి 85 మార్కులకుగాను ఎన్ని మార్కులు వచ్చాయో బహిర్గతం చేయకుండా 15 మార్కులకు ఎస్ఎస్ఏ, విద్యాశాఖ అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించారన్నారు. ఇందులో రాజకీయ ఒత్తిళ్లతో అనుభవంలేని వ్యక్తులకు ఈ పోస్టులు కట్టబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని కలెక్టర్‌కు తెలియజేశారు. స్కూల్ అసిస్టెంట్లకు ఐదేళ్ల కనీస అనుభవం లేకున్నా ఈ పోస్టులను ఇచ్చి, అర్హులకు అన్యాయం చేశారని కలెక్టర్‌కు వివరించారు. మార్కుల ను బహిర్గతం చేసి అర్హులైన వారికి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్, నాయకులు నారాయణస్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాఫ్ట్‌బాల్ మహిళా జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ జట్టును సోమవారం ఎంపిక చేశారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఇందుకు సంబంధించిన ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ తెలిపారు. ఈ జట్టు ఈనెల 30న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. లక్ష్మి, సురేఖ, మౌనిక, ధరణి, నాగప్రసన్నలక్ష్మి యాదవ్, లావణ్య, పల్లవి, మూర్చిత, రాధిక, ధరణి, బసంతి, కస్తూరి, శ్రావణి, జాహ్నవి, సుప్రియ, రిషిత జట్టులో చోటు సంపాదించుకున్నారు. స్టాండ్‌బైలుగా నేహ, సౌమ్య, అక్షిత, వైష్ణవి ఎంపికయ్యారు. సెలెక్షన్స్‌లో ఆర్డీటీ స్పోర్ట్స్ గ్రాస్‌రూ ట్ డైరెక్టర్ వంశీకృష్ణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సీఈఓ వెంకటేశులు, పీడీలు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు రెండు పతకాలు దక్కాయి. నగరానికి చెందిన హంజాహుస్సేన్ ఓపెన్ విభాగంలో బంగారు, రజతం, కాంస్య పతకాలు సాధించాడు. అనంతపురం నగరానికి చెందిన ఎక్కలూరు అమీనాతాజ్ కాంస్య పతకం కొల్లగొట్టాడు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

సెల్‌ఫోన్ లాక్కెళ్లిన దుండగులు

తనకల్లు, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ వ్యక్తిని ఏమార్చి సెల్‌ఫోన్‌ను దుండగులు సోమవారం లాక్కెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎగువతొట్లిపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి పండుగ సరుకుల కోసం తనకల్లుకు వచ్చాడు. సరుకులు తీసుకుని, ద్విచక్రవాహనంలో బైక్‌పై బయల్దేరాడు. మండలంలోని బొమ్మలకుంట సమీపంలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు గోపాల్ రెడ్డి వాహనానికి ఏదో తగులుకుందని చెప్పారు. దీంతో అతడు వాహనం ఆపి, కిందికి దిగి పరిశీలించడానికి వంగగానే జేబులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యాడని బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐటీఐ మిట్ట సమీపాన ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి.. రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ వెంకటేసులు తెలిపారు. ఘటనా స్థలంలో ఆధారాలు దొరక్కపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదుచేసి, మృతదేహాన్ని సర్వజనాస్పత్రికి తరలించామన్నారు. మృతుడి వయసు 55 నుంచి 60 ఏళ్లలోపు ఉంటుందనీ, తెలుపు రంగు చొక్కా, నీలం రంగు బనియన్, కాఫీ కలర్ ప్యాంటు వేసుకున్నాడన్నారు. ట్రైన్ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై, అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. సంబంధికులు 9441445354 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

అదృశ్య శక్తుల వివరాలు బయట పెట్టాలి

●ధర్మస్థల వివాదంపై ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్



రాయచూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ధర్మస్థల వ్యవహారానికి సంబంధించి కేసును ఉపసంహరించుకున్న వ్యక్తులు వారి వెనక ఉన్న అదృశ్య శక్తుల వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని రాయచూరు సిటీ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ డిమాండ్ చేశారు. సిట్ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పడం తప్పా ఎస్ఐటీ వేయడానికి గల కారణాలు వెల్లడించడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. సోమవారం నగరంలో విలేకరులతో మాట్లాడిన ఆయన సిట్ ఏర్పాటు నిర్ణయం మంత్రి వర్గ సమావేశంలో తీసుకున్నారా, ముఖ్యమంత్రి చుట్టూ ఉన్న వ్యక్తుల ఒత్తిడి మేరకు తీసుకున్నారా అని తెలియాల్సి ఉందన్నారు. ధర్మస్థల వ్యవహారం పై ఆరోపణలు వెల్లివెత్తినప్పుడే అవి కుట్రపూరితంగా చేశారన్న అనుమానం ప్రజల్లో మొదలైందని, హడావుడిగా సిట్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం దాని వెనక్క ఉన్న శక్తులు తదితర వాటి గురించి ఎందుకు విచారించడం లేదని ప్రశ్నించారు. ఈ వివరాలను ప్రజలకు వివరించే బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. ఈ వ్యవహారం కుట్రపూరితంగా ఉంది అన్నట్లు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలే స్పష్టం చేస్తుంనందున ప్రభుత్వం వివరాలు వెల్లడించాలన్నారు.

యూరియా పంపిణీపై విజిలెన్స్ ఆరా

బొమ్మనహాళ్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు సరఫరా చేయాల్సిన యూరియా దాచిపెట్టడం, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండటంతో విజిలెన్స్ అధికారులు తనిఖీ చేపడుతున్నారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని విజిలెన్స్ సీఐ జమల్‌బాషా, సిబ్బంది పరిశీలించారు. ఉంతకల్లు క్రాస్, శ్రీధరఘట్ట, ఉద్దేహాల్ గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. వారి వెంట ఏఓ సాయికుమార్ ఉన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయమ్...

మదర్ థెరీసా (జయంతి)



మానవత్వానికి ప్రతీకగా నిలిచిన మదర్ థెరీసా 1910 ఆగస్టు 26న ఉత్తర మెసిడోనియాలోని స్కోప్జే ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు ఆగ్నిస్ గోక్షా బొజాక్షు. రోమన్ కేథలిక్ సన్యాసిని. భారతదేశ పౌరసత్వం పొంది మిషనరీస్ ఆఫ్ ఛారిటీని కోల్కత్తాలో స్థాపించారు. 45 సంవత్సరాలపాటు ప్రపంచంలోని ఇతర దేశాలకు వ్యాపించేలా ఛారిటీ సేవలను విస్తరింపచేశారు. పేదలకు, రోగగ్రస్తులకు, అనాథలకు, మరణశయ్యపై ఉన్నవారికి పరిచర్యలు చేసి మానవతామూర్తిగా నిలిచారు. 1979లో నోబెల్ శాంతి పురస్కారాన్ని, 1980లో భారతరత్న పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమాల్లో భాగంగా మతమార్పిడులను ప్రోత్సహించారనే విమర్శలు ఎదుర్కొన్నారు. 1997 సెప్టెంబరు 5న కన్నుమూశారు. మరణానంతరం పోప్ జాన్‌పాల్ 2చే దైవ ఆశీర్వాదం (బీటిఫికేషన్), బ్లెస్డ్ థెరీసా ఆఫ్ కోల్కత్తా బిరుదు పొందారు.

స్కాట్ హెండెర్సన్ (పుట్టినరోజు)



కింగ్ ఆఫ్ గిటార్‌గా పేరొందిన అమెరికా దేశానికి స్కాట్ హెండర్సన్ 1954 ఆగస్టు 26న జన్మించారు. జాజ్ ఫ్యూజన్, బ్లూస్ గిటారిస్టుగా పేరొందారు. ప్రత్యేకించి 'ట్రైబల్ టెక్' బ్యాండ్‌తో కలసి పని చేసి పేరొందారు. 1980వ దశకంలో ఫ్యూజన్ బ్యాండ్స్‌లో ట్రైబల్ టెక్ తనదైన గుర్తింపు పొందింది. 1991లో నెంబరు జాజ్ గిటారిస్టుగా గిటార్ వరల్డ్ మ్యాగజైన్‌చే గుర్తింపు పొందారు. కాలిఫోర్నియాలోని మ్యుజీషియన్స్ ఇన్‌స్టి ట్యూట్‌లో ఒకటైన గిటార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో టీచింగ్ చేశారు.

జీతూ రాయ్ (పుట్టినరోజు)



షూటింగ్‌లో 'పద్మశ్రీ' అందుకున్న జీతూ రాయ్ 1987 ఆగస్టు 26న నేపాల్‌లో జన్మించారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 50 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లలో రాణించి 2014 ఏసియన్ గేమ్సులో దేశానికి తొలి స్వర్ణపతకం సాధించి చరిత్ర సృష్టించారు. 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో సత్తా చాటుకున్నారు. 2016లో ఖేల్‌రత్న అవార్డు అందుకున్నారు. 2020లో పద్మశ్రీ పురస్కారం పొందారు. కాగా ఆర్మీలో సుబేదార్ మేజర్ హోదాలో కొనసాగుతున్నారు.

మల్బరీ ఆకుల నాణ్యతను కాపాడుకోవాలి

రొద్దం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టు గూళ్ల నాణ్యతను పెంచాలంటే మల్బరీ ఆకుల నాణ్యతను కాపాడుకోవాలని ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు రమ్య, మురళీ అన్నారు. సోమవారం బీదానిపల్లిలో ప్రాంతీయ పట్టుపరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో నా పట్టు... నా అభిమానం పేరుతో పట్టు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టు పరిశ్రమలో చికిత్స కంటే నివారణ ముఖ్యమన్నారు. వ్యాధులు వచ్చిన తర్వాత పూర్తిగా నివారించడంకష్టమని, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏడీ రత్నం, ఎస్ఓ ఓబులేష్, పట్టు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సోమందేపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున బైక్ బోల్తాపడిన ఘటనలో పెనుకొండకు చెందిన యువకుడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు హిందూపురం నుంచి ద్విచక్రవాహనంలో పెనుకొండ వైపు వెళ్తున్న యువకుడు చాకర్లపల్లివద్ద మలుపులో అదుపుతప్పి బోల్తాపడినట్లు తెలిపారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ చిన్నపాటి గాయాలు కావడంతో క్షతగాత్రున్ని పెనుకొండ ప్రభుత్వ ఆ సుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదుచేయలేదన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి: సీఐ

మడకశిర టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వినాయక విగ్రహాల ఏర్పాటు చేసేవారు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సీఐ నాగేష్‌బాబు తెలిపారు. ఇందుకు పోలీస్‌స్టేషన్‌కు రావలిసిన పనిలేదన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు గణేశ్‌ఉత్సవ్ నెట్ అనే సైట్‌లో లాగిన్ అయి విగ్రహం ఎత్తు, కమిటీ మెంబర్లు కనీసం ఐదుగురికి తగ్గకుండా అందులో నమోదు చేయాలని సూచించారు. నమోదు చేసిన వివరాలు మా లాగిన్‌లోకి వస్తాయని పరిశీలించి వినాయక విగ్రహం ఏర్పాటుకు అనుమతులు ఇస్తామన్నారు. వినాయక విగ్రహం ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తు చేసుకొన్నవారికి బార్‌కోడ్ వస్తుందని తెలిపారు. బార్‌కోడ్‌ను మీరు ఏర్పాటు చేసే విగ్రహం వద్ద అతికించుకోవాలని ఊచించారు. బార్‌కోడ్‌ను స్కాన్ చేస్తే వివరాలు అందులో ఉంటాయని వివరించారు. ఇప్పటికే వినాయక విగ్రహం ఏర్పాటుకు సంబంధించి 32 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగాలని అందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

ఐక్యతను పెంచే క్రీడాపోటీలు

ఉత్సాహంగా అబ్దుల్‌కలాం కప్ క్రికెట్

విజయపుర, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు ఎలాంటి కులమత బేధభావాలు ఉండవని, పట్టణంలో ఇంతవరకు నిర్వహించిన ఎన్నో క్రికెట్ టోర్నమెంట్‌లు హిందూ ముస్లింల సౌహార్ద్రతకు సంకేతంగా ఉందని కేఎం మహేశ్ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని పీయూ కళాశాల క్రీడా మైదానంలో రెండురోజులపాటు నాల్గో వార్షిక ఏపీజే అబ్దుల్‌కలాం కప్ క్రికెట్ పోటీల ముగింపులో విజేతకు ట్రోఫీ అందచేశారు. టోర్నీ ప్రాయోజకులలో ఒకరైన సైఫుల్లా మాట్లాడుతూ పట్టణంలో ఇదే తొలిసారిగా రెండురోజుల టోర్నీని యూట్యూబ్ ద్వారా ప్రసారం చేసినట్టు తెలిపారు. మొత్తం 8 జట్లు పాల్గొన్నాయన్నారు. రానున్నరోజుల్లో కూడా క్రికెట్ పోటీలకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. ట్రోఫీని భరత్‌నగర్ క్రికెట్‌క్లబ్ జట్టు దక్కించుకుంది. జట్టు కేప్టెన్ తబరేజ్‌పాషాకు రూ.50వేల నగదు బహుమతి, ట్రోఫీని అందచేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన స్టార్ క్రికెట్‌క్లబ్ జట్టు కేప్టెన్ జావేద్‌పాషాకు రూ.30వేల నగదు అంద చేసి అభినందించారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన వాసిమ్, విజయపురకు చెందిన హరీశ్, సద్దాం హుసేన్, సోహెల్, అమానుల్లా, బాంబే ఇంజనీరింగ్ వర్క్స్ ముజమిల్ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీతో క్రికెట్‌జట్టు

ఆలోచనలు, అవకాశాలతోనే విజయం

రూరల్ ఎస్ఐ సతీశ్

శిడ్లఘట్ట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ సమర్థులే అని అయితే మన ఆలోచనలు, అవకాశాలే నాయకుడిగా విజయం సాధ్యం చేస్తాయని రూరల్ ఎస్ఐ సతీశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని డాల్ఫిన్ స్కూల్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మనం పెరిగిన వాతావరణం, మనకు లభించే మార్గదర్శకం, మనం ఆలోచించే విధానాలపై మన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుందన్నారు. విద్యార్థులు ముఖ్యంగా చదువుపై దృష్టి కేంద్రీకరించడంతోపాటు సమయస్ఫూర్తి, క్రమశిక్షణ అలవరచుకోవాలన్నారు. గురువు మార్గదర్శకంతో లక్ష్యం అందుకోవచ్చునన్నారు. ఉత్తమ అలవాట్లు లక్ష్యాన్ని చేరుకోవడానికి అనుకూలం అవుతాయన్నారు. అక్షరం నేర్పించిన గురువులను మరువరాదని, అన్నీ ఇచ్చిన ఈ సమాజరుణాన్ని తీర్చుకునే ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హైస్కూల్ విద్యార్థులకు కదంబ, రాష్ట్రకూట తదితర బృందాలకు ప్రమాణపత్రాలు అందచేశారు. విద్యాసంస్థ అధ్యక్షుడు నాగరాజ్, వ్యవస్థాపక డైరెక్టర్ అశోక్, కార్యదర్శి కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ సతీశ్‌కు సన్మానం

చెత్తను శాస్త్రీయంగా సంస్కరించాలి



మాంసపు వ్యర్థాల సంస్కరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంజుల, మాజీ మంత్రి అరవింద లింబావళి

మహదేవపుర, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మిటగానహళ్ళిలో చెత్తా చెదారాలను పడేయడం ద్వారా రోడ్డు, చెరువుతోపాటు తాగునీరు సైతం కలుషితమైందని వీటిని బాగు చేసేందుకు బీబీఎంపీయే పన్ను చెల్లించాలని మాజీ మంత్రి అరవింద లింబావళి డిమాండ్ చేశారు. కణ్ణూరులోని బనా ఇకోవర్క్స్ ఆధ్వర్యంలో మాంసవ్యర్థాలను సంస్కరించే విభాగాన్ని ఎమ్మెల్యే మంజుళాతో కలసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిటగానహళ్ళిలో చెత్త వేయడాన్ని ప్రభుత్వం శాశ్వతంగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. చెత్తవేయడాన్ని మరో ప్రాంతానికి తరలించడంతోపాటు శాస్త్రీయంగా సంస్కరించాల్సిన అవసరం ఉందన్నారు. తడి, పొడి చెత్తతోపాటు ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను వేరుచేయాలన్నారు. తద్వారా ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కాగా మాంసపు వ్యర్థాలను కణ్ణూరు పంచాయతీ పరిధిలో సేకరించి సంస్కరించిన అనంతరం వాటిని వీధి కుక్కలు, చేపలకు ఆహారంగా ఇవ్వదలిచినట్లు అభిప్రాయపడ్డారు. పీపీపీ విధానంలో సంస్కరణా విభాగం ఏర్పాటుకు తానే సలహా ఇచ్చానన్నారు. కోళ్లు, గొర్రెల మాంసపు వ్యర్థాలను సంస్కరించి కుక్కలకు ఆహారంగా తయారు చేయదలిచేలా ఈ కేంద్రం దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా బీబీఎంపీ రిటైర్డు చీఫ్ కమిషనర్ మంజునాథ్‌ప్రసాద్, కణ్ణూరు గ్రామపంచాయతీ అధ్యక్షుడు అశోక్, బనా ఎకోవర్క్స్ పాలనా డైరెక్టర్ అభిషేక్, మహదేవపుర టాస్క్‌ఫోర్స్ సంచాలకులు లింగరాజ్ అరసు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై గణపతి రూపంలో అవగాహన

బెంగళూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగకు రెండు రోజుల ముందే మైసూరు నగర వీధులలో వినాయకుడి రూపంలో భిన్నమనిపించేలా ప్రజలలో అవగాహవన కల్పించారు. బ్లడ్‌బ్యాంక్ కేంద్రం తరుపున నగర వ్యాప్తంగా పలు సర్కిళ్ళలో కళాకారుడు లోహిత్ రక్తదానం చేయాలంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఇదే సందర్భంగా రక్తదానం ద్వారా మరొకరి ప్రాణాలు కాపాడవచ్చుననే రీతిలో ప్రచారం చేస్తున్నట్లు లోహిత్ తెలిపారు. ఎవరైనా రక్తదానం చేయవచ్చునని తద్వారా ఆరోగ్యానికి ఎటువంటి నష్టం లేదని పైగా ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. సమాజంలో అత్యవసర సంఘటనలు జరిగినప్పుడు రక్తం ఎంతో అవసరమన్నారు. రోగికి అవసరమైన గ్రూపు రక్తం మాత్రమే అందించాల్సి ఉంటుందన్నారు. రామనగర్ సర్కిల్‌తో పాటు నగర వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.



వాహనదారులకు వినాయకుడి రూపంలో అవగాహన కల్పిస్తున్న లోహిత్

ఇలావదిలేస్తే ఎలా..?

- ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయాలు
- కొన్ని మొండిగోడలకే పరిమితం
- రూ.లక్షల ప్రజాధనం వృథా

గోరంట్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాలని సచివాలయాలు ఏర్పాటు చేసి, భవన నిర్మాణాల విషయంలో వాటిని పూర్తి చేయాలేక ప్రజాధనం దుర్వినియోగం అయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రూ..45 లక్షల వ్యయంతో సచివాలయ భవనం నిర్మాణ పనులు ప్రారంభించగా, పక్కనే రైతు భరోసా కేంద్రం, హెల్త్‌క్లినిక్‌కు ప్రత్యేక భవనాలు నిర్మించతలపెట్టారు. మండలంలో 20 సచివాలయాలుండగా, గతంలో మందలపల్లి-1, బూదిలి సచివాలయాల నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభించారు. మిగిలిన వాటిలో మల్లాపల్లి, గోరంట్ల, 2, 3, 4, సచివాలయ భవనాలు పూర్తి అయినా, ప్రారంభించకపోవడంతో కంపచెట్లు పెరిగి వృథాగా పడి ఉన్నాయి. భవనాలు వినియోగించకపోవడంతో అందులోని సామగ్రి శిథిలావస్థ చేరింది. ఇందులోని సంత మార్కెట్, శివాలయం, సచివాలయాలను కుట్టు శిక్షణకోసం వినియోగిస్తున్నారు. మిగిలిన వాటిలో 12 సచివాలయాకు రెండో స్లాబ్ వేసి అర్థాంతరంగా పనులు ఆపివేశారు. గోరంట్ల-5 సచివాలయం, ఎమ్మార్సీ వద్దగల ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో నిర్మిస్తున్నారని, కోర్టు అభ్యంతరంతో కాంట్రాక్టర్ పనులు ఆపివేశారు. గంగంపల్లిలోనూ గ్రౌండ్‌స్లాబ్ పూర్తి చేసి వదిలేశారు. ఇక్కడున్న హెల్త్ సబ్ సెంట్ పాతభవనం తొలగించి నూతన భవనం నిర్మించాలని చేపట్టిన పనులు మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. పాత భవనం ఉన్నా ప్రజలకు ఉపయోగపడటం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం మల్లాపల్లిలోని గోకుల ఆశ్రమంలో సచివాలయం నిర్వహిస్తున్నారు. అలాగే గోరంట్ల పంచాయతీలో 5 సచివాలయాలుండగా, పట్టుపరిశ్రమ శాఖ షెడ్‌లో 1, 3 సచివాలయాలు, మిగిలినవి గ్రామ చావిడితోనూ, వ్యవసాయ శాఖ పాత గిడ్డంగి, సంత మార్కెట్ నూతన ఆర్ఎస్‌కే భవనంలో నిర్వహించాల్సి వస్తోంది. మేజర్ పంచాయతీ అయినా సొంత భవనం లేక ఇబ్బందిపడుతున్నారు. మల్లాపల్లి సచివాలయ భవన నిర్మాణాలను గ్రామానికి 2.5 కిలోమీటర్ల దూరంలో గుమ్మయ్యగారిపల్లి వద్ద ఏర్పాటు చేయడంతో పంచాయతీ ప్రజలే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



ప్రారంభానికి నోచుకోని మల్లాపల్లి సచివాలయం, రైతు సేవా భవనాలు



గంగంపల్లిలో అర్ధాంతరంగా ఆగిన హెల్త్ క్లినిక్ భవనం

ఫుట్‌బాల్ పోటీలకు 23మంది బృందం



మీడియా సమావేశంలో ఫుట్‌బాల్ కోచ్ హెడ్ ఖలీద్ జమీల్

బెంగళూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఏసియన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (సీఏఎఫ్ఏ) నేషన్స్ కప్ 2025 పోటీలకు దేశం నుంచి 23 మంది జట్టు పాల్గొంటున్నారని ఇండియా హెడ్‌కోచ్ ఖలీద్ జమీల్ తెలిపారు. ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోటీలకు జట్టు బెంగళూరు నుంచి బృందం బయల్దేరుతుందన్నారు. 29న తజకిస్తాన్, సెప్టెంబరు 1న ఇరాన్, సెప్టెంబరు 4న ఆఫ్ఘనిస్థాన్ హోస్ట్ చేయనుందన్నారు. 23మంది జట్టులో గోల్‌కీపర్స్‌గా గురుప్రీత్‌సింగ్, అమ్రేందర్‌సింగ్, హృతిక్ తివారి వ్యవహరిస్తారన్నారు. మీడియా సమావేశంలో ఫెడరేషన్ అధ్యక్షుడు కల్యాణ్, ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎన్ఏ హారిస్ పాల్గొన్నారు.

నేటి నుంచి కోలారు ఓపెన్ 2025 గోల్ఫ్ పోటీలు

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గోల్ఫ్ క్రీడల అధికారికంగా అనుమతి పొందిన సంస్థ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా, జియాన్ హిల్స్ గోల్ఫ్ కౌంటి సంయుక్త ఆధ్వర్యంలో కోలారు ఓపెన్ 2025 పోటీలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 29వరకు పోటీలు జరగనుండగా కోటి రూపాయలు బహుమానం పంపిణీ చేయనున్నారు. ప్రముఖ గోల్ఫ్ క్రీడాకారులు అంగద్‌కీమా, ఒలింపిక్ క్రీడాకారుడు ఉదయన్ మానె, ఓంప్రకాశ్ చౌహాన్, మనుగందాస్, అర్జున్ ప్రసాద్, శౌర్య భట్టాచార్య పాల్గొననున్నారు. జియాన్‌హిల్స్ గోల్ఫ్ కౌంటి ఎండీ జార్జ్ మనోంపరంపిల్ మాట్లాడుతూ విదేశీ క్రీడాకారులలో శ్రీలంకనుంచి తంగరాజ్ ప్రభాకరన్, బంగ్లాదేశ్ నుంచి జమాల్ హుసేన్, ఇటలీనుంచి మిషన్ ఆప్పోలమి, అమెరికా నుంచి కోయిచిరోసటో, నేపాల్‌కు చెందిన సుభాష్‌తమాంగ్, ఉగాండాకు చెందిన జోషువాసీల్‌లు పాల్గొంటారన్నారు. సీఈఓ అమన్‌దీప్‌చోప్లా తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి ఆజాదీ మ్యూజిక్ ఫెస్టివల్

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జానపద, గిరిజన, ర్యాప్, గజల్, శాస్త్రీయ సంగీత అపూర్వ కార్యక్రమాలను ఈనెల 29నుంచి ఆజాది మ్యూజిక్ ఫెస్టివల్ పేరిట సెప్టెంబరు 7వరకు నిర్వహిస్తున్నారు. జేపీనగర్‌లోని ఇండియన్ మ్యూజిక్ ఎక్స్‌పీరియన్స్ కేంద్రంలో జరిగే ఫెస్టివల్‌లో 23 ఉచిత సంగీత ప్రదర్శనలు, జానపదం, గిరిజన నృత్యం ఉండనుంది. ఇండియన్ మ్యూజిక్ ఎక్స్‌పీరియన్స్ దర్శకురాలు ప్రిమాజాన్ మాట్లాడుతూ బెంగళూరులో ఇదే తొలిసారి ఆజాది సంగీత ఉత్సవం జరుగుతోందన్నారు. బంగ్లా నాటక్ సహకారంతో మ్యూజిక్స్ ఎక్స్‌పీరియెన్స్ సంస్థ ఏర్పాటు చేస్తోందన్నారు. జార్ఖండ్‌కు చెందిన సరైకల, కర్సావాన్ జిల్లా గురుకుశకుమార్ కరువా, సరైకల్ చౌ ప్రదర్శకులు, ఒడిశ్శాకు చెందిన కురాపుట్ గురుకుమార్ జాని నేతృత్వంలోని బృందం పరోజా, జానపద నృత్యాలు ప్రదర్శించనున్నారు. దివ్యం సోది, క్వాబ్, గజల్‌లు ఉంటాయన్నారు. ప్రతిరోజూ భిన్నమైన సమయంలో కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు.

మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించండి

హిందూపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సాగులో రైతు లు మెలకువలు పాటించాలని వ్యవసాయశాఖ ఏడీ కృష్ణయ్య సూచించారు. సోమవారం మోతుకపల్లివద్ద మొక్కజొన్న పంటను పుట్టపర్తి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య, జిల్లా వనరుల కేంద్రం అధికారి చైతన్య, ఏడీ పరిశీలించారు. వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. అనవసరంగా ఎరువులు వాడకూడదన్నారు. సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తే దిగుబడి అధికంగా వస్తుందన్నారు. ఏఓ సురేంద్రనాయక్, రైతులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పెనుకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెడ్‌రిబ్బన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పెనుకొండకు చెందిన విద్యార్థులు రెండోస్థానంలో నిలిచారు. కళాశాలకు చెందిన ఎస్.శబరీన్‌తాజ్, ఎస్.నిజాముద్దీన్, రెండోస్థానం సాధించి రూ.4వేలు నగదు బహుమతిని అందుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి రెడ్ రిబ్బన్ అధికారి మునిరత్నం, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి చెన్నకేవశవప్రసాద్ చేతులమీదుగా నగదు అందజేశారు. 26వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. విద్యార్థులను రెడ్‌రిబ్బన్ నోడల్ అధికారి జయప్రకాశ్, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పీఓలు, సిబ్బంది అభినందించారు.

రోడ్డుపై వేలాడిన విద్యుత్ తీగలు



రహదారిపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

గోరంట్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి ప్ర ధాన రహదారిపై నీటి పథకం పంప్ హౌస్ సమీపం పెద్దల ఈదులవంక వద్ద సోమవారం సాయంత్రం విద్యుత్ స్తంభం విరిగి తీగలు రోడ్డుపై వాలాయి. సమీప గ్రామస్థులు పరిస్థితి గమనించి రహదారిపై వస్తున్న వాహనాలను ఆపి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శేఖర్ వెంటనే స్పందించి విద్యుత్ అధికారులకు తెలిపారు. హిందూపురం తదితర ప్రాం తాలనుంచి భారీ వినాయక విగ్రహాలను లారీల్లో తీసుకెళ్తుండగా వాటి తాకిడికి విద్యుత్ తీగలు తగిలి స్తంభం నేలకొరిగిన ట్లు భావిస్తున్నారు. ట్రాన్స్‌కో ఏఈ క్రిష్ణ శ్రీనివాస్ సిబ్బంది ద్వారా విద్యుత్ సరఫరాను నిలిపివేసి నేలకొరిగిన విద్యుత్ తీగలను తొలగించి, రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. అనంతరం విద్యుత్ స్తంభం పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు.

గౌరీపూజకు వేళాయె



వినాయక విగ్రహాల వద్ద మహిళల సందడి

(5వ పేజీ తరువాయి) పూలు, పండ్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు మార్కెట్‌లకు రాగా ప్రతి చోటా కిటకిటలాడింది. పూల ధరలు రెండువారాల వ్యవధిలో వరమహాలక్ష్మి వ్రతం తర్వాత అమాంతంగా పెరిగాయి. మల్లెలు, కనకాంబరాలు వేలరూపాయలు పలకగా చేమంతి, చెండు పూలు, ఇతరత్రా పుష్పాల ధరలు వందలలో ఉన్నాయి. ఇక అరటి, జామ, యాపిల్, సీతాఫలం, ద్రాక్ష, చీనీ తదితర పండ్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. నగరంలోని కేఆర్ మార్కెట్‌లో అర్ధరాత్రి నుంచే ప్రజల సందడి మొదలైంది. రాత్రిదాకా మార్కెట్ కిటకిటలాడింది. మల్లేశ్వరం, మడివాళ, ఎలక్ట్రానిక్‌సిటీ, జయనగర్, యలహంక, ఆర్‌టీనగర్ తదితర ప్రాంతాల మార్కెట్‌లలో గౌరీదేవితో పాటు మట్టి వినాయక విగ్రహాల కొనుగోళ్లకు ప్రజలు ఆసక్తి చూపారు. ఇక బుధవారం వినాయక విగ్రహాల ప్రతిష్ఠకు భారీగా ఏర్పాట్లు సాగుతున్నాయి.



స్వామి పూజకు రంగు రంగుల పూలు



కేఆర్ మార్కెట్‌లో పూల దుకాణం వద్ద...



ఆర్‌టీ నగర్‌లో మట్టి విగ్రహాలు



ఇంట్లో పూజకు మట్టి గణపతి..



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,627.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	55.393	37,489
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	28,711	9,488
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	86.27



చెట్టుపై కూర్చున్న ఎలుగుబంటి

చెట్టు ఎక్కిన ఎలుగుబంటి

బళ్లారి సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చెట్టుపైన ఉన్న ఎలుగుబంటిని చూసి స్థానికులు బెంబేలెత్తిపోయారు. సోమవారం ఉదయం కూడ్లిగి తాలూకాలోని చంద్రశేఖర్ గ్రామంలో ఓ చెట్టుపై ఎలుగుబంటి కనిపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మారెప్ప అనే జాలరి పొలంలో ఎలుగుబంటి ప్రత్యక్షం అయ్యింది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎలుగుబంటికి మత్తుమందు ఇచ్చిన తర్వాత ఎలుగుబంటిని పట్టుకున్నామని ప్రస్తుతం దానిని కమలాపూర్ జూకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.

డీజేకు అనుమతించాలని వినతి

కంప్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాల్లో, నిమజ్జన వేడుకల్లో డీజే ఏర్పాటుకు అనుమతించాలని కర్ణాటక రక్షణ వేదిక విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఎంఎస్ మున్నా ఒక ప్రకటనలో తెలిపారు. పక్కనే వున్న కొప్పళ జిల్లా కన్నడ సంస్కృతి శాఖ మంత్రులు శివరాజ్ తంగడి ప్రభుత్వ నియమాలను అనుసరించుకుని డీజేకు అనుమ తించారని, పట్టణంలో కూడా అనుమతిస్తే భక్తి పాటలతో వేడుకలు జరుపుకుంటామన్నారు.

మహిళ ఆత్మహత్య

బళ్లారి రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని మోకా గ్రామానికి చెందిన పులిస్వామి భార్య ఉమాదేవి (35) సోమవారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఉమాదేవికి నలుగురు పిల్లలున్నారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉమాదేవి ఆత్మహత్యకు పాల్పడింది. ఇటీవల దంప తుల మధ్య పలుమార్లు గొడవ జరిగినట్లు తెలుస్తోంది. మనస్తాపంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యులు వాపోయారు. ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు మోకా పోలీసులు తెలిపారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

సిరుగుప్ప, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.4.90 లక్షల వ్యయంతో నిర్మించనున్న సముదాయ భవన నిర్మాణ పనులకు నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ సోమవారం భూమిపూజ చేపట్టారు. పట్టణంలోని 26వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో నాణ్యతగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నగర అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదలైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా నగరసభ ఉపాధ్యక్షురాలు యశోద, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఎం సతీష్, గణేష్, వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం

హిందూపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టివినాయకున్నే పూజిద్దామని పాంచజన్య పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. చవితి పండును పురస్కరించుకుని సోమవారం పాఠశాలలో మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడేదిశగా మట్టి వినాయకులను పూజించాలని పిలుపునిచ్చారు.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణ సౌకర్యం

● చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న యశ్వంత్ రాజ్ నాగిరెడ్డి

బళ్లారి సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణసౌకర్యం కల్పిస్తామని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి అన్నారు. సోమవారం బీడీసీసీఐ ఆడిటోరియంలో బళ్లారి డిస్ట్రిక్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ ప్రాక్టీషనర్స్ ఇండియా, బళ్లారి టాక్స్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్న పరిశ్రమల బిజినెస్ రూల్ ఇంజిన్ లోన్ ప్రాడక్ట్ ప్రొగ్రామ్ యొక్క ప్రధాన లక్ష్యం. కొత్త వ్యాపారాన్ని ప్రారంభించాలనుకునే వ్యవస్థాపకులకు అవసరమైన ఆర్థిక సహాయం ,వివిధ రకాల ఉత్పత్తులను అందించడమే నన్నారు. ఇటువంటి పథకాలను అమలు చేయడం ద్వారా కొత్త వ్యవస్థాపకులు ధైర్యం, విశ్వాసం, ఉత్సాహాన్ని పొందుతారన్నారు. వారి వ్యాపారాన్ని విజయవంతంగా స్థాపించడానికి విస్తరించడానికి మరిన్ని అవకాశాలను పొందుతారు. వారి వ్యాపారాన్ని విస్తరించడానికి మరిన్ని అవకాశాలను అందజేస్తామన్నారు. బీడీసీసీఐ గౌరవ కార్యదర్శి సురేశ్‌బాబు మాట్లాడుతూ తమ సంస్థలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం హర్షణీయ మన్నారు. వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ సోనాల్ నాయక్ మాట్లాడుతూ బళ్లారి టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ పనితీరు అభినందనీయమన్నారు. ఏ సమస్య వచ్చినా తక్షణం పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ కులకర్ణి, శివకుమార్, దిలీప్ కుమార్, మహంతేశ్ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. సురేశ్‌బాబు, మర్చిడ్ మల్లికార్జునగౌడ, రామచంద్ర, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుళువ సమాజాభివృద్ధికి సహకారం

● మఠం నిర్మాణానికి భూమి కొనుగోలు: మంత్రి సంతోష్ లాడ్



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంతోష్‌లాడ్

బళ్లారి సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆల్ కర్నాటక కుళువ సమాజ్ కొత్త మహాసంస్థాన్ మఠం నిర్మాణం కోసం త్వరలో ఐదు ఎకరాల భూమిని కొనుగోలు చేయనున్నట్లు మంత్రి సంతోష్‌లాడ్ తెలిపారు. ఆదివారం సండూర్ పట్టణంలోని ఆదర్శ కళ్యాణ మంటపంలో అఖిల కర్ణాటక కుళువ మహాసంఘ్ సండూర్ తాలూకా కమిటీ నిర్వహించిన శరణ నూలియా చందయ్య 918వ జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కుళువ సమాజం సమగ్ర అభివృద్ధి, సరైన మార్గదర్శకత్వం కోసం కొత్త మఠానికి గురువులు అవసరం. సంఘం నాయకులందరూ కొత్త గురువులను నియమించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సండూర్ పట్టణంలోని కొరమ, కొరచ, కొరవ వర్గాల పేద ప్రజలకు ప్రభుత్వం భూమి, గృహసౌకర్యాలను అందిస్తోందన్నారు. సమాజంలోని ప్రజల మతపరమైన కార్యకలాపాల సౌలభ్యం కోసం ఒక కొత్త ఆధునిక కమ్యూనిటీ హాల్ నిర్మించబడుతుందని, రాష్ట్రంలో 15లక్షల మంది కార్మికులకు ఆరోగ్య బీమా అమలు చేయడం హర్షణీయమన్నారు. జగద్గురు బసవమూర్తి మాదరచన్నయ్య మహాస్వామి మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల్లో 101 కులాలు ఉన్నాయని, రాష్ట్రంలోని షెడ్యూల్డ్‌కులాలు దోపిడీకి గురవుతున్న అన్ని వర్గాల అభివృద్ధి కోసం ఐక్యంగా ఉండాలన్నారు. శరణ నూలియా చందయ్య జయంతి కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఆదర్శ కల్యాణమంటపం వరకు శరణుడి చిత్రపట ఊరేగింపును సంఘం నిర్వహించింది. మహిళలు పూర్ణకుంభాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఈసందర్భంగా సండూరులోని విరక్తమఠం ప్రభుస్వామీజీ, మదురీస్ పురుషోత్తమానందపురి స్వామీజీ, శివమొగ్గలోని నారాయణ మఠానికి చెందిన రేణుకానంద స్వామీజీ, కులహళ్ళి మఠంలోని షట్చిన్మయ స్వామీజీ, ఎంపీ తుకారం, ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారం, బాబు జగ్జీవన్‌రామ్‌లెదర్ కార్పోరేషన్ మాజీ అధ్యక్షుడు ముక్‌జీవన్‌రామ్, లెదర్ కార్పోరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివానంద, తాలూకా విభాగం అధ్యక్షుడు రమేశ్, బళ్లారి ,విజయనగరం జిల్లాల సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

● బసవలింగ మహాస్వామి చిత్తరగి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బసవలింగస్వామి

బళ్లారి సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పిల్లలు చెడువాట్లకు దూరంగా ఉండాలని చిత్రదుర్గ జిల్లా మొళకల్మూరు తాలూకా సిద్దయ్య కోటే విజచమంతేశ్వర శాఖాధిపతి బసవలింగ మహాస్వామి చిత్తరగి సూచించారు. సోమవారం నగరంలోని రాజ్‌కుమార్‌రోడ్డులోని ప్రభుత్వ ప్రీ-యూనివర్శిటీ కళాశాలలో 'పిల్లల జీవితం కోసం శరణాలయాల ఆలోచనలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు గుట్కా, పొగాకు, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఇవి ఆరోగ్యానికి జీవితానికి హానికరం, బసవన్న శ్లోకాలను అధ్యయనం చేసి ఆయన ఆదర్శాలను సూత్రాలను జీవితంలో స్వీకరించాలన్నారు. విజయ మహామంతేశ్వర శాఖ కార్యదర్శి కాంత్‌రాజ్ మాట్లాడుతూ పూజ్యనీయులు రాష్ట్రంలోని అనేక జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలను సందర్శించి పిల్లల జీవితాల్లో వెలుగులు నింపి ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా పిల్లల దుర్గుణాలను అరికట్టడానికి ప్రయత్నించడం గొప్ప కార్యమన్నారు. ప్రిన్సిపాల్ సుంకప్ప అధ్యక్షత వహించి మాట్లాడుతూ నేటి పిల్లలు గొప్ప తత్వవేత్తల జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. పాఠ్యాంశాలతోపాటు, అధ్యాత్మిక ఆలోచనలపై ఉపన్యాసాలు విద్యార్థుల జవితాలను సుసంపన్నం చేయడానికి సహాయపడతాయన్నారు. కార్యక్రమంలో సంగీతకారులు ముంకేష్, యోగేశ్ వచన సంగీతాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా కళాశాల అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు రమేశ్ బుజ్జి, సీనియర్ లెక్చరర్ తిమ్మప్ప, పొలిటికల్ సైన్స్ లెక్చరర్ నాగారెడ్డి, చంద్రహాస్, మల్లికార్జునశెట్టి లెక్చరర్లు ,విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాం గేట్లను పునర్నిర్మించాలి

● ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి ● 8న రాష్ట్రవ్యాప్త ఆందోళన ● రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చామరస మాలిపాటిల్

రాయచూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నాలుగు జిల్లాల రైతులకు వర ప్రదాయనగా ఉన్న తుంగభద్ర డ్యాం నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని కర్ణాటక రైతు సంఘం హసిరు సేనల గౌరవధ్యక్షుడు చామరస మాలిపాటీల్ అన్నారు. గేట్ల మరమ్మత్తులు కొత్త గేట్‌ల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం తన వైఖరిని ఈ నెలాఖరులోగా ప్రకటించాలన్నారు. లేని పక్షంలో సెప్టెంబర్ 8న గేట్ల పునర్ నిర్మాణంతో పాటు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పై డ్యాం ముందు నాల్గు జిల్లాల రైతులతో ఆందోళన చేపడుతామన్నారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గతేడాది డ్యాం 19వ గేట్ విరిగిపోగా తాత్కాలికంగా దాన్ని మరమ్మత్తు చేసిన సందర్భంగా నిపుణులు అన్ని గేట్‌లను పునర్ నిర్మించాలని ప్రభుత్వానికి సూచించారన్నారు. 70 ఏళ్లు దాటిన నేపథ్యంలో గేట్ల పునర్ నిర్మాణానికి ప్రభుత్వం టెండర్‌లు పిలిచి గుజరాత్ కంపెనీకి టెండర్లు ఖరారు చేసినా ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడం ఎందుకని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఈ ఏడాది సహితం రబీ సీజన్‌లో రైతులకు పంటనష్టానికి గురైయ్యే పరిస్థితి తెల్తిందన్నారు. దీంతో పాటు డ్యాంలో 35 శాతానికిపైగా సిల్ట్ పేరుకుపోవడం వల్ల నీటి లభ్యత తగ్గిపోయి రైతులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ సమస్యలపై తాము నాలుగు జిల్లాల రైతులతో కలిసి ప్రత్యేక్ష ఆందోళనకు దిగుతున్నట్లు చామరస మాలిపాటీల్ తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్



ఆందోళనలో విద్యార్థులు

విద్యార్థుల నిరసన

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు నిరసన బాట పట్టారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఇంతవరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సరైన ఉపన్యాసకులు లేకపోవడం, పాఠ్యబోధనలు ప్రారంభం కాకపోవడాన్ని నిరసిస్తూ ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో సోమవారం సరళాదేవి కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి కంబళి మంజునాథ్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూజీసీ కొత్త నిబంధనలు పాటించడంలో రాష్ట్ర ప్రభుత్వం పాటించడం తప్పనిసరి కాదని సుప్రీకోర్టు తీర్పులో ఉందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం విద్యార్థులకు విద్యను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం సారించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వ విద్యావిధానాలు సక్రమంగా నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ ఆందోళనలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరణ్ణ, ఉపాధ్యక్షుడు ఎం.శాంతి, సభ్యులు హొన్నూరుస్వామి, మంజు, రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలను పూడ్చిన పోలీసులు



గుంతలను పూడుస్తున్న పోలీసులు, స్థానికులు

కంప్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): హూవిన హడగలి తాలుకాలోని హిరేహడగలి పోలీస్ స్టేషన్ పోలీసులు స్థానిక ప్రజల సహకారంతో రోడ్డుపై ఉన్న వందలాది గుంతలను మూసేసి ఆదర్శంగా నిలిచారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా హిరేహడగలిని తోరణగల్లు మైలార్ రాష్ట్ర రహదారిపై భారీగా గోతులు పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు దాటుతుండగా తరచూ ప్రమాదాలు జరిగిన సంఘటనలు వున్నాయి. సోమవారం ఉదయం పీఎస్ఐ భరత్, ప్రకాష్, పోలీసు సిబ్బందితో కలిసి బంద్రకల్లి సుమారు 5 గంటలు శ్రమించి గుంతలు పూడ్చేశరు. 20 ట్రిప్పులకు పైగా మట్టి పోసి రహదారిని బాగు చేశారు. హగరనూరు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు రుద్రానాయక్, హిరేహడగలి పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ సిద్దప్ప, సిబ్బంది నాగరాజు, రాఘవేంద్ర, చన్న బసవనగౌడ్, లక్ష్మణ్, శివనాయక్, శ్రీశైల తదితరులు కలిసి గుంతను మూసివేశారు. ఎస్ఐ భరత్‌రెడ్డి, ఏఎస్ఐ సిద్దప్ప, రాఘవేంద్ర, నాగరాజుపి, శివనాయక, చెన్నబసవగౌడ, సిబ్బంది తదితరులు వున్నారు.

గణేశ్ ఉత్సవాలపై శాంతిసభ



మాట్లాడుతున్న సీఐ రుద్రప్ప

బళ్లారిం`హరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మోకా గ్రామం ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం వినాయక చవితి, ఈద్ ముబారక్ పండుగ సందర్భంగా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రుద్రప్ప నేతృత్వంలో శాంతిసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రుద్రప్ప మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకుని వినాయకుడిని ప్రతిష్ఠించాలని, ప్రతి ఒక్కరూ నిబంధన ప్రకారం డీజే, బాణసంచా పేల్చడం సరికాదన్నారు. అనుమతి ఇచ్చిన స్థలాల్లోనే విగ్రహాలను ప్రతిష్ఠించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదన్నారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహ, పోలీసు సిబ్బంది, బసవన్న గౌడ, నరసింహ, బసవరాజు, జగన్నాథ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

సిరుగుప్ప(ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలు, ఈద్ మిలాద్ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ శోభారాణి సూచించారు. సోమవారం సిరుగుప్ప పట్టణం లక్ష్మీవెంకటేశ్వర కళ్యాణమండపంలో గణేష ఉత్సవాలు, ఈద్ మిలాద్ వేడుకలను పురస్కరించుకుని శాంతిసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డీజే సౌండ్ సిస్టమ్‌కు అనుమతి వుండదని, విగ్రహాలను ప్రతిష్ఠించేవారు నగరసభ, జెస్కామ్ పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ సంతోష్‌చౌహాన్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ పరశురామ్, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, భజరంగదళ్ కార్యకర్తలు, ముస్లిం ప్రముఖులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



అంజుమ్‌సాదియా

హోస్పేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): హోస్పేట రూరల్ పోలీస్ స్టేషన్‌పరిధిలోని నాగేనహళ్లి గ్రామానికి చెందిన 20 ఏళ్ల అంజుమ్‌సాదియా అనే యువతి అదృశ్యం అయినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారం క్రితం బయటికి వెళ్లి తిరిగి వస్తానని వెళ్లిపోయిన యువతి మళ్లీ రాలేదని తల్లిదండ్రులు వాపోయారు. యువతి 5.3అడుగుల పొడవు, నల్లటి రంగు, పొడవాటి ముఖం, బంగారు రంగు ప్యాంటుధరించి ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఆకుపచ్చ రంగు టాప్ ధరించి కన్నడ, హిందీ మాట్లాడుతుందని యువతి ఆచూకీ తెలిస్తే హోస్పేట కంట్రోల్ రూమ్ 94808057700, పోలీస్‌స్టేషన్ నెంబర్: 08394228233 సమాచారం ఇవ్వాలని రూరల్ పోలీసులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):2025-26సంవత్సరంలో ప్రభుత్వం అందించే పలు రకాల సహాయం కొరకు దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సాధికారత శాఖ ద్వారా 13లబ్ధిదారుల ఆధారిత సౌకర్యాలను అందించడానికి శాఖ పథకం కింద ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ)అమలు చేయబడింది. ఆల్‌లైన్‌తో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి రామాంజినేయ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్దిదారులు గ్రామ్ వన్ కర్ణాటక వన్ సేవా నందు ఆల్‌లైన్ పోర్టల్ ప్రతిభావంతులైన దివ్యాంగ విద్యార్థులు ప్రోత్సహక పథకం పిల్లల సంరక్షణ భత్యం, నిరుద్యోగ భృతి, ఆధార్ పథకం, మరణ పరిహార నిధి, సాధన పథకం, వైద్యపరిహారనిధి తదితర అవసరాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరికాల పథకం, వినికిడి లోపం ఉన్నవారికి, స్వయం ఉపాధి కోసం కుట్టు యంత్రపథకం, దృష్టి లోపం ఉన్నవారికి బ్రెయిలీ కిట్ పథకం, బ్యాటరీతో నడిచే వీల్‌ఛైర్ పథకాలకు సెప్టెంబరు 30లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు గ్రామ పంచాయతీ వీఆర్‌డబ్ల్యూ, నగర సభ, పట్టణ పంచాయతీ యూఆర్‌డబ్ల్యూ, తాలూకా పంచాయతీ ఎంఆర్‌డబ్ల్యూ, జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి కార్యాలయం నందు సంప్రదించాలన్నారు.

హోసూరు జోన్



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మునుస్వామి

రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

హోసూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శూలగిరి సమీపాన అంకొండపల్లి పంచాయతీ, ఎస్ తిమ్మసంద్ర గ్రామంలో రూ.5లక్షలతో సిమెంటు రోడ్డు పనులను వేపనపల్లి ఎమ్మెల్యే మునుస్వామి భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం ప్రజల సమస్యలు ఆలకించారు. గ్రామీణ యువకులకు క్రికెట్ కిట్‌లను అందచేశారు. కార్యక్రమంలో శూలగిరి నార్త్ యూనియన్ కార్యదర్శి బాబు వెంకటాచలం, జిల్లా సభ్యురాలు మల్లయన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మేయర్ సత్య

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు: మేయర్

హోసూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరం పారిశ్రామికంగానే కాక విద్యలోనూ ప్రగతి పరంగా ఉందని నిత్యం లక్ష మంది విద్యార్థులు, లక్షమందికిపైగా కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారని తద్వారా ట్రాఫిక్ రద్దీ ఉందని, నియంత్రణకు చర్యలు చేపడతామని నగర మేయర్ సత్య అభిప్రాయపడ్డారు. టైటాన్ సంస్థ, భారతీయ పరిశ్రమల సంఘం (సీఐఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మేయర్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని మాట్లాడారు. పరిశ్రమల వల్ల జీఎస్టీ ఆదాయంలోనూ హోసూరుకు ప్రత్యేకత ఉందన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు బాగలూరు రోడ్డు, ఫ్లై ఓవర్ పనులు త్వరలోనే పూర్తి అవుతాయన్నారు. సమావేశంలో హోసూరు జిల్లా కార్మికసంఘం నాయకుడు మనోకరన్, ఆదియమాన్ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి లాసియా, సీఐఐ ఉపాధ్యక్షుడు దేవరాజన్, కావేరి ఆసుపత్రి డైరెక్టర్ విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించాలని విద్యార్థుల నిరసన

రాయచూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డిగ్రీ కళాశాలల్లో వెంటనే అతిథి ఉపన్యాసకుల నియామకం చేపట్టాలని ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు అయ్యాళప్ప డిమాండ్ చేశారు. ఉపన్యాసకుల నియామకంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తు ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో సోమవారం మహానగర పాలిక కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఏఐడీఎస్ఓ నాయకులు, డిగ్రీ కళాశాలలు పునఃప్రారంభమై నెల రోజులు దాటినా అతిథి ఉపన్యాసకుల నియామకం చేపట్టకపోవడంతో బోధనకు ఆటంకం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని కళాశాలల్లో 80 నుంచి 90 శాతం మంది అతిథి ఉపన్యాసకులే బోధన చేయాల్సి ఉన్న దుస్థితిలో ప్రభుత్వం వారి నియామకం పై దృష్టి పెట్టకపోవడం బాధ్యతరాహిత్యమన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయాల పైనే రాష్ట్రం ఆధారపడే అవసరం లేదని విద్యార్థుల బోధన స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని వెంటనే నియామకాలు చేపట్టాలన్నారు. యూజీసీ ఇస్తున్న మార్గదర్శకాలు, కోర్టుల్లో నడుస్తున్న వ్యాజ్యాల ఆధారంగా అతిథి ఉపన్యాసకుల నియామకంలో జాప్యం జరుగుతుందన్నట్లు చప్పడం సరికాదన్నారు. త్వరలోనే డిగ్రీ విద్యార్థులకు ఇంటర్నల్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉపన్యాసకులు లేకుండా బోధన సాగకుండా పరీక్షలు ఎలా రాస్తారని ప్రశ్నించారు.



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టిన విద్యార్థులు